https://trinetnews.com/
# ట్రైనెట్ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక
తాజా తెలుగు వార్తలు
ప్రతి 3 గంటలకు
98497 67747 | 9494184136
7 AM TO 10 AM
సంపుటి: 01 / సంచిక:30 / పేజీలు :02 / వేల:2/రూ / ఎడిటర్: వెంకటేశ్వర్లు రాపోలు / మంగళవారం, సెప్టెంబర్ 15,2026

# ట్రంప్ సర్కార్‌కు కోర్టులో భారీ ఎదురుదెబ్బ

## విద్యార్థులు, జర్నలిస్టుల వీసాల పరిమితులపై బ్రేక్

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు15

విదేశీ విద్యార్థులు, ఎక్స్ఛేంజ్ సందర్శకులు, జర్నలిస్టులపై వీసా నిబంధనలను కఠినతరం చేయాలన్న ట్రంప్ ప్రభుత్వ నిర్ణయానికి అమెరికా కోర్టులో భారీ ఎదురుదెబ్బ తగిలింది. విదేశీయులు అమెరికాలో ఎంతకాలం ఉండవచ్చనే దానిపై పరిమితులు విధిస్తూ ట్రంప్ ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త నిబంధనను బోస్టన్‌లోని ఫెడరల్ న్యాయమూర్తి నిలిపివేశారు.ఈ నిబంధన అమల్లోకి రావడానికి ఒక్కరోజు ముందు యూఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి ఎఫ్. డెన్నిస్ సేలర్ ఈ తీర్పు ఇవ్వడం గమనార్హం. కార్మిక సంఘాలు, ఉన్నత విద్యా రంగానికి చెందిన పలు సంస్థలు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం.. హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం (డిహెచ్ఎస్) ఇచ్చిన వివరణలు సరిపోవని స్పష్టం చేసింది.విదేశీ విద్యార్థులు, ఎక్స్ఛేంజ్ సందర్శకులు, జర్నలిస్టుల బస కాలాన్ని పరిమితం చేయడానికి హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం జాతీయ భద్రత, వీసా వ్యవస్థలో మోసాలను అరికట్టడం వంటి కారణాలను చూపిందని జడ్జి తెలిపారు. అయితే ఈ విధాన మార్పు వల్ల తలెత్తే సమస్యలను సమర్థంగా పరిశీలించడంలో, తక్కువ కఠినమైన ప్రత్యామ్నాయాలను పరిగణనలోకి తీసుకోవడంలో ఆ శాఖ విఫలమైందని పేర్కొన్నారు. డిహెచ్ఎస్ ఇచ్చిన కారణాలను "అత్యంత బలహీనమైనవి"గా జడ్జి అభివర్ణించారు.కొత్త నిబంధన అమల్లోకి వస్తే దాదాపు ఐదు దశాబ్దాలుగా అమెరికాలో అమల్లో ఉన్న విధానంలో భారీ మార్పు వచ్చేది. ప్రస్తుతం విదేశీ విద్యార్థులు తమ విద్యా కార్యక్రమం కొనసాగుతున్నంత కాలం చట్టబద్ధంగా అమెరికాలో ఉండేందుకు అవకాశం ఉంది. అయితే ట్రంప్ ప్రభుత్వం జూలైలో తీసుకొచ్చిన కొత్త నిబంధనతో ఈ విధానాన్ని మార్చాలని నిర్ణయించింది. విదేశీ విద్యార్థులు, సాంస్కృతిక మార్పిడి కార్యక్రమాల్లో పాల్గొనేవారికి నిర్దిష్ట కాలపరిమితి విధించడంతో పాటు జర్నలిస్టుల వీసాలపైనా పరిమితులు పెట్టాలని ప్రతిపాదించింది.కొత్త నిబంధన ప్రకారం.. F, J, I వీసాలపై పరిమితులుF వీసా: విదేశీ విద్యార్థులకు గరిష్ఠంగా నాలుగేళ్ల పరిమితిJ వీసా: సాంస్కృతిక, విద్యా మార్పిడి కార్యక్రమాల్లో పాల్గొనేవారికి నాలుగేళ్ల పరిమితిI వీసా: విదేశీ జర్నలిస్టులకు ప్రస్తుతం సంవత్సరాలపాటు కొనసాగుతున్న బసను 240 రోజులకు పరిమితం చేసే ప్రతిపాదనప్రస్తుతం అమెరికాలో సుమారు 16 లక్షల మంది ఖీ వీసా కలిగి ఉండగా, మరో 5 లక్షల మంది జీ వీసాపై ఉన్నారు. ఎంఐటీ, హార్వర్డ్ వంటి ప్రముఖ పరిశోధనా విశ్వవిద్యాలయాల్లోనూ భారీ సంఖ్యలో విదేశీ విద్యార్థులు, ముఖ్యంగా గ్రాడ్యుయేట్ స్థాయిలో చదువుతున్నారని జడ్జి తన తీర్పులో పేర్కొన్నారు.కొత్త విధానం అమల్లోకి వస్తే విదేశీ విద్యార్థుల చేరికలు తగ్గే అవకాశం ఉందని, ప్రముఖ విశ్వవిద్యాలయాలకు వందల మిలియన్ డాలర్ల వరకు అదనపు ఆర్థిక భారం పడే ప్రమాదం ఉందని న్యాయమూర్తి హెచ్చరించారు. విదేశీ విద్యార్థులు, పరిశోధకులు దశాబ్దాలుగా అమెరికా శాస్త్ర, వైద్య, సాంకేతిక రంగాల అభివృద్ధికి కీలకంగా దోహదపడ్డారని ఆయన గుర్తుచేశారు. వారి ద్వారా అమెరికా ఆర్థిక వ్యవస్థకూ గణనీయమైన ప్రయోజనం చేకూరిందని పేర్కొన్నారు. "ఉన్నత విద్యా వ్యవస్థతో పాటు అమెరికా ఆర్థిక వ్యవస్థకు కలిగే నష్టం విపత్తు స్థాయిలో ఉండే అవకాశం ఉంది" అని జడ్జి సేలర్ హెచ్చరించారు. ఈ తీర్పుతో విదేశీ విద్యార్థులు, పరిశోధకులు, ఎక్స్ఛేంజ్ సందర్శకులు, విదేశీ జర్నలిస్టులపై ప్రతిపాదించిన వీసా కాలపరిమితులకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. అయితే ట్రంప్ ప్రభుత్వం ఈ తీర్పుపై తదుపరి న్యాయపరమైన చర్యలకు వెళ్లే అవకాశం ఉంది.



## సౌదీ అరేబియాలో 110 మిలియన్ టన్నుల యురేనియం నిల్వలు..

# యుద్ధం వేళ సౌదీ జాక్‌పాట్

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు15



ఇరాన్ యుద్ధం కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్న సౌదీ అరేబియాకు భారీ జాక్‌పాట్ తగిలింది. సౌదీ అరేబియాలో 110 టన్నుల ముడి యురేనియం నిల్వలు ఉన్నట్లు వెల్లడైంది. మెదీనా ప్రాంతంలో యురేనియం సహా పలు అరుదైన ఖనిజాలు బయటపడ్డట్లు సౌదీ అరేబియాకు చెందిన ఎనర్జీ మినిస్టర్ ప్రిన్స్ అబ్దులాజిజ్ బిన్ సల్మాన్ అన్నారు.మెదీనా ప్రాంతంలోని జబల్ సయిద్ ప్రాజెక్టు వద్ద అధ్యయనం చేస్తుండగా 110 టన్నుల అరుదైన ఖనిజాలు, యురేనియం నిల్వలు లభ్యమైనట్లు ఆయన వెల్లడించారు. ఇరాన్ యుద్ధం కారణంగా ప్రస్తుతం సౌదీ చాలా ఇబ్బందులు పడుతోంది. ముఖ్యంగా ఇరాన్ మద్దతుదారులైన హౌతీ ఉగ్రవాదులు సౌదీ అరేబియాపై దాడులకు దిగుతోంది. దీనివల్ల అక్కడి చమురు క్షేత్రాలు దెబ్బతింటున్నాయి. పోర్టులపై, చమురు నౌకలపై దాడి జరుగుతోంది. దీనివల్ల సౌదీ తీవ్రంగా నష్టపోతుంది. ఇలాంటి పరిస్థితుల్లో యురేనియం నిల్వలు బయటపడటం ఆ దేశానికి భారీ ఊరటనిచ్చేదే.సున్నీలకు చెందిన సౌదీ అరేబియాకు.. షియాలకు చెందిన ఇరాన్‌కు మధ్య ఘర్షణ నెలకొంది. అయితే, ఇప్పుడు పరిస్తితుల్ని చక్కదిద్దుకునేందుకు ఇరు దేశాలు ప్రయత్నిస్తున్నాయి. మరోవైపు సౌదీ అరేబియా కూడా 2030లోపు అణ్వాయుధ శక్తిగా ఎదగాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ దిశగా ప్రయత్నాలు ప్రారంభించింది. అమెరికాతో కలిసి సౌదీ అణు కార్యక్రమాన్ని చేపడుతోంది. ఇలాంటి తరుణంలో యురేనియం బయటపడటం కలిసొచ్చే అంశమే.

02



## పోలీసుల కళ్ల ముందే దాడికి యత్నిస్తే.. ప్రజలకు రక్షణ ఎక్కడ?

### నిలదీసిన పాడి కౌశిక్ రెడ్డి

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు15

రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో తెలంగాణలో శాంతిభద్రతల పరిస్థితి రోజురోజుకూ దిగజారిపోతోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీస్‌స్టేషన్ వద్దే దాడికి ప్రయత్నించే పరిస్థితి రావడం పోలీసు వ్యవస్థ పనితీరుపై అనేక అనుమానాలు కలిగిస్తోందన్నారు. సైఫాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కేటీఆర్ పీఏ మహేందర్‌రెడ్డి, పీఆర్వో మహేశ్‌పై దాడికి ప్రయత్నించిన ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారుఅసెంబ్లీ సమావేశాల ప్రారంభం రోజున అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చేపట్టిన నిరసనకు సంబంధించిన ఘటనలో కేటీఆర్ పీఏ మహేందర్‌రెడ్డి, పీఆర్వో మహేశ్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం కేసులు నమోదు చేసిందని కౌశిక్‌రెడ్డి తెలిపారు.

## పోలీస్‌స్టేషన్‌లోనే దాడి జరిగితే.. సామాన్యుడి పరిస్థితి ఏంటి..

# కాంగ్రెస్‌పై కేటీఆర్ ధ్వజం

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు15



సైఫాబాద్ పోలీస్‌స్టేషన్‌లో తన పీఆర్వో మహేశ్, పీఏ మహేందర్ రెడ్డిపై జరిగిన దాడిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. పోలీస్‌స్టేషన్‌లో, యూనిఫాంలో ఉన్న అధికారుల సమక్షంలోనే పక్కా ప్రణాళికతో దాడికి ప్రయత్నించడం ఆందోళనకరమని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలను అడ్డుకోకపోతే భవిష్యత్‌లో రాష్ట్రంలో పరిస్థితులు మరింత దిగజారే ప్రమాదం ఉందని హెచ్చరించారు."సామూహిక దాడులు ఎప్పుడూ హత్యతోనే ప్రారంభం కావు. కొన్నిసార్లు పూర్తిగా పనిచేస్తున్న పోలీస్‌స్టేషన్‌లో, యూనిఫాంలో ఉన్న అధికారుల సమక్షంలో పక్కా ప్రణాళికతో జరిగే దాడితో ప్రారంభమవుతాయి"అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. రాష్ట్ర యంత్రాంగం గూండాయిజాన్ని ప్రోత్సహిస్తూ, దానికి సహకరిస్తున్న తీరు తనను ఆందోళనకు గురిచేస్తోందని అన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే త్వరలోనే వీధుల్లో సామూహిక దాడులు, మూకదాడులు జరిగే పరిస్థితిని చూస్తామని కేటీఆర్ హెచ్చ రించారు.సైఫాబాద్ పోలీస్‌స్టేషన్‌లో తన పీఆర్వో మహేశ్ మాణిక్య, పీఏ మహేందర్ రెడ్డికి ఎదురైన ఘటన ఏ తెలంగాణ పౌరుడికైనా జరగవచ్చని పేర్కొన్నారు. అణచివేతకు తలొగ్గని ఏ పౌరుడికైనా ఇలాంటి పరిస్థితి ఎదురయ్యే ప్రమాదం ఉందని అన్నారు. తెలంగాణ పూర్తిస్థాయి గందరగోళం, అరాచక పరిస్థితుల అంచున ఉందని కేటీఆర్ వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న పరిణామాలకు కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని విమర్శిస్తూ.. "వెల్‌డన్ కాంగ్రెస్" అంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. దీన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి ట్విట్టర్(ఎక్స్) వేదికగా ట్యాగ్ చేశారు.

## కేటీఆర్ సిబ్బందిపై ఆరోపణలను ఖండించిన డీసీపీ..

### డీజే పర్మిషన్ కావాలంటే మాస్కులతో రావాలా అంటూ నెటిజన్ల సెటైర్లు!

సైఫాబాద్ పోలీస్‌స్టేషన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పీఆర్వో మహేశ్, పీఏ మహేందర్ రెడ్డిపై దాడి తీవ్ర రాజకీయ దుమారం రేపాయి. ముసుగులు ధరించిన కొంతమంది వ్యక్తులు పోలీస్‌స్టేషన్‌లోకి ప్రవేశించి కేటీఆర్ సిబ్బందిపై దాడికి యత్నించారని బీఆర్ఎస్ నేతలు ఆందోళన చేపట్టగా.. అసలు ఎలాంటి దాడి జరగలేదని సైఫాబాద్ పోలీసులు స్పష్టం చేశారు. పోలీస్‌స్టేషన్‌లోని సీసీటీవీ కెమెరాలను పరిశీలించామని, దాడికి సంబంధించిన ఎలాంటి ఘటన కనిపించలేదని ఖైరతాబాద్ జోన్ డీసీపీ శిల్పవల్లి వెల్లడించారు.

02

## ప్రభుత్వమే టాస్క్‌ఫోర్స్ పోలీసులను ముసుగులో పంపించింది..

### కేటీఆర్ సిబ్బందిపై దాడి ఘటనపై హరీశ్‌రావు

# ఆగ్రహం

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు15



మా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పీఆర్వో, పీఏపై పోలీస్ స్టేషన్ సాక్షిగా ముసుగులు ధరించిన పోలీసులతో దాడి చేయించడాన్ని తీవ్రంగా ఖండిస్తు న్నామని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు తెలిపారు. పండగ రోజున విచారణ పేరుతో పోలీస్ స్టేషన్‌కు రప్పించి, సాయంత్రం 6:30 గంటల సమయంలో సుమారు 15 మంది ముసుగులు ధరించిన పోలీసులు దాడికి యత్నించారని తెలిపారు. ఇంటరాగేషన్ రూమ్‌లోకి వెళ్లి వారిపై దాడి చేసేందుకు ప్రయత్నించారని అన్నారు. అక్కడే ఉన్న బీఆర్ఎస్ లీగల్ టీం దాడిని గమనించి కేకలు వేస్తూ అడ్డుకోవడంతో, ముసుగులు ధరించిన పోలీసులు అక్కడి నుంచి పారిపోయారని పేర్కొన్నారు.ప్రభుత్వమే పోలీస్ స్టేషన్‌కు ముసుగులు ధరించిన టాస్క్ ఫోర్స్ పోలీసులను పంపించి దాడికి యత్నించడం అత్యంత దుర్మార్గమని హరీశ్‌రావు మండిపడ్డారు.

02



# పోలీస్ స్టేషన్‌లోనే కేటీఆర్ సిబ్బందిపై దాడి..

## ముసుగులతో వచ్చి దాడి చేసినా పట్టించుకోని పోలీసులు!

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు15

సైఫాబాద్ పోలీస్‌స్టేషన్ వద్ద మంగళవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పీఏ మహేందర్ రెడ్డి, పీఆర్వో మహేశ్ మాణిక్య విచారణ నిమిత్తం సైఫాబాద్ పోలీస్‌స్టేషన్‌కు హాజరైన సమయంలో ముసుగులు ధరించిన కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు తమపై దాడికి యత్నించారు. ఎస్సై సమక్షంలో ఈ దాడి జరగడం గమనార్హం. ఈ ఘటనకు సంబంధించి సీసీటీవీ ఫుటేజ్ బయటపెట్టాలని బీఆర్ఎస్ లీగల్ సెల్ డిమాండ్ చేయగా.. సీసీ కెమెరాలు పనిచేయడం లేదని పోలీసులు చెప్పారు. దీంతో వివాదం కాస్త ముదిరింది.

02

మొదటిపేజీ తరువాయి

# పోలీస్ స్టేషన్‌లోనే కేటీఆర్ సిబ్బందిపై దాడి..

ఇటీవల అసెంబ్లీ గేట్ నంబర్-3 వద్ద జరిగిన ఆందోళనలకు సంబంధించి మహేందర్ రెడ్డి, మహేష్‌లపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణలో భాగంగా వారిద్దరూ మంగళవారం విచారణకు హాజరయ్యారు. అదే సమయంలో పోలీస్ స్టేషన్‌కు వచ్చిన 15 మంది దుండగులు కేటీఆర్ పీఏ, పీఆర్వోపై దాడి చేశారు. అయితే బీఆర్ఎస్ లీగల్ సెల్ న్యాయవాదులు తిరగబడటంతో వారు అక్కడ నుంచి పారిపోయారు. కాగా, ఈ ఘటనపై బీఆర్ఎస్ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాడికి సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్ ఇవ్వాలని వారు అడగ్గా.. సీసీ కెమెరాలు పనిచేయడం లేదని పోలీసులు తెలిపారు. దీనిపై కేటీఆర్ సిబ్బందితో పాటు బీఆర్ఎస్ లీగల్ సెల్ న్యాయవాదులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇందులో కుట్ర కోణం లేకపోతే సీసీ ఫుటేజ్ ఇవ్వడానికి ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు.

**జక్కుల లక్ష్మణ్ అగ్రహం**

పోలీస్‌స్టేషన్‌లోకి ముసుగులు ధరించిన వ్యక్తులు ప్రవేశించి దాడికి యత్నించినా పోలీసులు కనీసం ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయలేదని బీఆర్ఎస్ లీగల్ సెల్ న్యాయవాది జక్కుల లక్ష్మణ్ ఆరోపించారు. పోలీస్‌స్టేషన్‌లోకి ఎస్‌హెచ్‌వో ప్రమేయం లేకుండా గుర్తు తెలియని వ్యక్తులు ఎలా వస్తా రని ప్రశ్నించారు. "పోలీస్ డిపార్ట్‌మెంట్ ఫెయిల్ అయింది. పోలీస్‌స్టేషన్‌లోకి 15 మంది దుండగులు మాస్కులు వేసుకొని వెళ్తే కనీసం ఎఫ్ఐఆర్ కూడా చేయలేదు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అడిగితే పోలీస్‌స్టేషన్ సీసీటీవీ ఫుటేజ్ కూడా ఇవ్వడం లేదు. ప్రభుత్వమే దగ్గరుండి పోలీస్‌స్టేషన్‌లో దాడి చేయించేందుకు ప్రయత్నించింది" అని జక్కుల లక్ష్మణ్ ఆరోపించారు.

**బీఆర్ఎస్ నేతల అరెస్టు**

కేటీఆర్ సిబ్బందిపై దాడి యత్నం జరిగిందన్న నేపథ్యంలో పోలీస స్టేషన్‌కు బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తులు భారీగా తరలివచ్చారు. దాడికి సంబంధించిన సీసీ ఫుటేజ్‌ను బయటపెట్టాలని, దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు స్టేషన్ ఎదుట ఆందోన చేపట్టారు. దీంతో వారిని పోలీసులు అరెస్టు చేశారు. బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్‌ను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బీఆర్ఎస్ లీగల్ సెల్‌కు చెందిన న్యాయవాదులు కల్యాణ్ రావు, భాస్కర్ గౌడ్, హరీష్, కార్తీక్, సాయినాథ్‌తో పాటు పలువురిని పోలీసులు అరెస్ట్ చేశారు. న్యాయం కోసం డిమాండ్ చేస్తున్న న్యాయవాదుల పట్ల పోలీసులు దురుసుగా ప్రవర్తించారని, వారిని ఈడ్చివేశారని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. అరెస్ట్ చేసిన వారిలో కొంతమందిని గోల్కొండ, మరికొంత మందిని శంషాబాద్ తదితర పోలీస్‌స్టేషన్లకు తరలించినట్లు సమాచారం.

మొదటిపేజీ తరువాయి

# కేటీఆర్ సిబ్బందిపై ఆరోపణలను ఖండించిన డీసీపీ..

ఖైరతాబాద్ జోన్ డీసీపీ శిల్పవల్లి మీడియాతో మాట్లాడుతూ.. అసెంబ్లీ వద్ద జరిగిన వివాదానికి సంబంధించిన కేసు విచారణలో భాగంగానే కేటీఆర్ పీఏ, పీఆర్వోలను సోమవారం పోలీస్‌స్టేషన్‌కు పిలిచామని తెలిపారు. అదే సమయంలో స్థానికంగా ఉండే కొంతమంది యువకులు గణేశ్ మండపం వద్ద డీజేకు అనుమతి కోసం సాయంత్రం పోలీస్‌స్టేషన్‌కు వచ్చారని వివరించారు. డీజే పర్మిషన్ విషయమై సైఫాబాద్ సీఐతో వారు మాట్లాడుతుండగా.. వారిలో ఒకరు కేటీఆర్ పీఆర్వో మహేశ్‌ను గుర్తించారని తెలిపారు.అసెంబ్లీ వద్ద న్యూసెన్స్ చేసిన వారిని మర్యాదగా కూర్చోబెట్టి మాట్లాడతారా అంటూ ఆ యువకుడు పోలీసులతో వాగ్వాదానికి దిగాడని డీసీపీ చెప్పారు. అలా మాట్లాడొద్దని సీఐ వారించడంతో యువకులు పోలీస్‌స్టేషన్ నుంచి వెళ్లిపోయారని వివరించారు. పోలీస్‌స్టేషన్‌లో జరిగిన పరిణామాలపై సీసీటీవీ కెమెరాలను పరిశీలించామని డీసీపీ శిల్పవల్లి తెలిపారు. కేటీఆర్ పీఆర్వో మహేశ్, పీఏ మహేందర్ రెడ్డిలపై ఎలాంటి దాడి జరగలేదని వివరణ ఇచ్చారు

**డీజే పర్మిషన్ కావాలంటే మాస్కులతో రావాలా మేడం.. నెటిజన్ల సెటైర్లు**

పోలీసుల వివరణపై కొందరు నెటిజన్లు సెటైర్లు వేస్తున్నారు. "డీజే పర్మిషన్ కోసం వచ్చిన వాళ్లు సైఫాబాద్ ఎస్‌హెచ్‌వోతో ర్యాష్‌గా మాట్లాడి గొడవ చేసినా.. వారిని ఏమీ అనకుండా ఎస్ఐ బయటికి పంపించారా" అని సందేహంగా ప్రశ్నించారు. మేడం చెప్పేది చిన్న పోరడు కూడా నమ్మేలా లేదని.. కొత్తగా ట్రై చేయాలని సూచించారు. డీజే పర్మిషన్ కోసం వచ్చిన వారు ముఖాలకు మాస్కులు ఎందుకు వేసుకుంటారు.. వినడానికి విచిత్రంగా ఉందని అనుమానం వ్యక్తం చేశారు. డీజే పర్మిషన్ అడగాలంటే మాస్క్ వేసుకుని వెళ్లాలా అని ప్రశ్నించారు. ఎదవ స్క్రిప్ట్ రాజాసాబ్ కంటే వరస్ట్‌గా ఉందని కామెంట్స్ పెట్టారు. మంచి కథల పోటీల్లో ప్రాక్టీస్ చేయాలని పలువురు సూచించారు.




మొదటిపేజీ తరువాయి

పోలీసుల కళ్ల ముందే దాడికి యత్నిస్తే..

# ప్రజలకు రక్షణ ఎక్కడ?

విచారణ పేరుతో వినాయక చవితి పండుగ రోజున వారిని సైఫాబాద్ పోలీస్‌స్టేషన్‌కు పిలిపించడం రాజకీయ కక్షసాధింపులో భాగమేనని ఆరోపించారు.మహేందర్‌రెడ్డి, మహేశ్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన సమయంలో సుమారు 15 మంది మాస్కులు ధరించిన వ్యక్తులు వారిపై దాడికి ప్రయత్నించారని కౌశిక్‌రెడ్డి ఆరోపించారు. పోలీసుల సమక్షంలోనే ఈ ఘటన చోటుచేసుకోవడం మరింత ఆందోళన కలిగిస్తోందన్నారు. బీఆర్ఎస్ లీగల్ సెల్ న్యాయవాదులు అడ్డుకోవడంతోనే వారు అక్కడి నుంచి వెళ్లిపోయారని పేర్కొన్నారు. పోలీస్‌స్టేషన్‌లోకి వచ్చి.. పోలీసుల కళ్ల ముందే దాడికి ప్రయత్నించేంత ధైర్యం వారికి ఎక్కడి నుంచి వచ్చింది? వారికి ఎవరి అండ ఉంది?" అని కౌశిక్‌రెడ్డి ప్రశ్నించారు. ఘటన వెనుక ఉన్న వ్యక్తులను గుర్తించి, పూర్తి స్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.రాజకీయ ప్రత్యర్థులను ఎదుర్కోలేక కేసులు నమోదు చేయడం, విచారణల పేరుతో వేధించడం, చివరకు పోలీస్‌స్టేషన్ వద్దే దాడులకు ప్రయత్నించడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని కౌశిక్‌రెడ్డి విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని.. ఆ హక్కును అణచివేయడం సరికాదన్నారు. హోంశాఖను కూడా నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ ఘటనపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పోలీసుల సమక్షంలో జరిగిన ఈ ఘటనను తేలికగా తీసుకోకుండా మాస్కులు ధరించి వచ్చిన వ్యక్తులను గుర్తించి వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు."చట్టాన్ని కాపాడాల్సిన పోలీస్‌స్టేషన్‌లోనే చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే పరిస్థితి వస్తే.. రాష్ట్రంలో సామాన్యుడికి భద్రత ఎక్కడ ఉంటుంది?" అని కౌశిక్‌రెడ్డి ప్రశ్నించారు. తెలంగాణలో శాంతిభద్రతలను కాపాడాల్సిన ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపులను పక్కనపెట్టి ప్రజల భద్రతపై దృష్టి పెట్టాలని సూచించారు. సైఫాబాద్ పోలీస్‌స్టేషన్ ఘటనపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, దాడికి ప్రయత్నించిన వ్యక్తులను గుర్తించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి డిమాండ్ చేశారు.

మొదటిపేజీ తరువాయి

# కాంగ్రెస్‌పై కేటీఆర్ ధ్వజం

**రేవంత్ పాలనలో రౌడీ రాజ్యం నడుస్తోంది**

హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న సైఫాబాద్ పోలీసుస్టేషన్ లోకి ఏకంగా 15 మంది గుండాలు అక్రమంగా చొరబడి నా పీఆర్వో మహేష్, పీఏ మహేందర్ రెడ్డిపై మూకుమ్మడిగా దాడి చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని కేటీఆర్ విమర్శించారు. రేవంత్ రెడ్డి పాలనలో రాష్ట్రంలో రౌడీల రాజ్యం, గుండాల రాజ్యం నడుస్తోందని ఆరోపించారు. ఇది కాంగ్రెస్ గుండాల పనా ?? లేక మఫ్టీలో పోలీసులకే ముసుగులు వేసి కుట్రపన్ని ఈ దాడి చేయించరా ?? వెంటనే దీనిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.రాజకీయ కక్షతో పెట్టిన పోలీసు కేసు విచారణ కోసం స్టేషన్ కు పిలిపించి ఖాకీల సమక్షంలో ఈ దాడి చేయించడం వెనక ముమ్మాటికి ముఖ్యమంత్రి హస్తం ఉందని కేటీఆర్ అన్నారు. ఉదయం విచారణకు రమ్మని చెప్పి చీకటి పడే వరకూ కాలయాపన చేయడం చూస్తే, ముందే ఈ దాడి చేయాలన్న కుట్ర పన్నినట్టు స్పష్టంగా అర్థమవుతోందని పేర్కొన్నారు. గౌరవ హైకోర్టు తదుపరి ఆదేశాల వరకూ మహేశ్, మహేందర్ రెడ్డిపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని స్పష్టంగా ఆదేశాలు ఇవ్వడంతో కక్ష సాధింపులో భాగంగానే ఈ దుశ్చర్యకు పాల్పడ్డారు. ఈ సంఘటనకు హోం మంత్రిగా, ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ముసుగు ధరించిన గుండాల దాడిలో గాయపడ్డ పీఆర్వో మహేశ్, పీఏ మహేందర్ రెడ్డి కి వెంటనే రక్షణ కల్పించి వారికి మెరుగైన చికిత్స అందించాలన్నారు. పోలీస్ స్టేషన్ లోపల, బయట ఉన్న అన్ని సీసీ కెమెరాల ఫుటేజీని వెంటనే భద్రపరచాలన్నారు. ఈ అరాచక పర్వానికి పాల్పడిన ప్రతి ఒక్క కాంగ్రెస్ గుండాను గుర్తించి వారిని కఠినంగా శిక్షించాలి. లేకపోతే దీ=ా పార్టీ ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

మొదటిపేజీ తరువాయి

# కేటీఆర్ సిబ్బందిపై దాడి ఘటనపై హరీశ్‌రావు ఆగ్రహం

రాష్ట్రంలో పోలీస్ కస్టడీలో ఉన్న వ్యక్తులపై పోలీస్ స్టేషన్‌లోనే దాడి చేసేందుకు ప్రయత్నిస్తుంటే.. ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించారు. ప్రభుత్వ తప్పులను ఎత్తిచూపితే దాడులు చేస్తారా అని నిలదీశారు. ఈ కేసులో తదుపరి ఆదేశాలు వెలువడే వరకు ఎలాంటి చర్యలు చేపట్టవద్దని హైకోర్టు ఆదేశాలు ఇచ్చినప్పటికీ.. వాటిని సైతం లెక్కచేయకుండా ఈ దాడి యత్నం చేయడం కోర్టు ఆదేశాలను ధిక్కరించడమే అని స్పష్టం చేశారు.హోం శాఖ బాధ్యతలు కూడా నిర్వర్తిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే ఈ ఘటనపై స్పందించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. పోలీస్ స్టేషన్‌లో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన పూర్తి సీసీటీవీ ఫుటేజ్‌ను వెంటనే బహిర్గతం చేయాలన్నారు. ముసుగులు ధరించి దాడికి యత్నించిన పోలీసులను గుర్తించి, వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి, చట్ట ప్రకారం అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. పోలీస్ స్టేషన్‌నే దాడులు జరుగుతుంటే రాష్ట్రంలో శాంతిభద్రతలు ఉన్నట్లా లేనట్లా ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు.

# నేను అక్కడికక్కడే చనిపోయి ఉండేదాన్ని నిందితుడికి గురుగ్రామ్ బైకర్ సియా కౌంటర్

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు15

హర్యానాలోని గురుగ్రామ్‌లో మహిళా బైకర్‌ను కారు ఢీకొట్టిన ఘటనపై తీవ్ర చర్చ జరుగుతోంది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. తాజాగా ఈ ఘటనలో బాధితురాలైన బైకర్ సియా.. నిందితుడు కల్యాణ్ వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చారు. 'మీకు నా మీద జాలి ఉంటే.. ఎందుకు ఆపలేదు? నేను అక్కడికక్కడే చనిపోయి ఉండేదాన్ని' అని పేర్కొన్నారు ఘటన గురించి కల్యాణ్ మీడియాతో మాట్లాడారు. బైక్ నడుపుతున్నది మహిళో, పురుషుడో తనకు తెలియలేదని, సియా పట్ల బాధ కలిగిందని కల్యాణ్ పేర్కొన్నారు. బైకర్లు పదేపదే వేగం పెంచుతూ, తగ్గిస్తూ తనను రెచ్చగొట్టారని అన్నారు. ఉద్దేశపూర్వకంగా ఆ బైక్‌ను ఢీకొట్టలేదని చెప్పారు. అలాగే యాక్సిడెంట్ తర్వాత బైకర్ల గుంపు తనను, తన కుటుంబాన్ని కొట్టే ప్రమాదం ఉందనే భయంతో అక్కడి నుంచి వెళ్లిపోయానని తెలిపారు. కల్యాణ్ వ్యాఖ్యలపై తాజాగా సియా స్పందించారు.'నేను మహిళనని తెలియదనడం అవాస్తవం. కారు నాకు దగ్గరగా వచ్చినప్పుడు నా జుట్టు వారికి కనిపించింది . నన్ను ఆపాలని సైగలు చేశారు. అలాంటప్పుడు బైక్‌పై ఉన్నది మహిళ అని తెలియదని చెప్పడం నమ్మశక్యంగా లేదు. మేం వాళ్లను రెచ్చగొట్టలేదు. మీరు నిజంగా నా గురించి ఆందోళన చెందితే.. ప్రమాదం జరిగిన వెంటనే ఎందుకు ఆపలేదు. నేను అక్కడికక్కడే చనిపోయి ఉండేదాన్ని' అని సియా పేర్కొన్నారు.



# అమిత్ షా యూసీసీ ప్రకటనపై ఆచితూచి స్పందిస్తున్న మిత్రపక్షాలు

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు15

ఎన్డీఏ భాగస్వామ్య ప్రభుత్వాలున్న 21 రాష్ట్రాల్లో ఉమ్మడి పౌర స్మృతి (యూనిఫాం సివిల్ కోడ్-యూసీసీ)ని అమలు చేస్తామన్న కేంద్రమంత్రి అమిత్ షా ప్రకటనపై ఆ కూటమికి చెందిన మూడు పార్టీలు ఆచితూచి స్పందిస్తున్నట్టు తెలుస్తోంది. తెలుగు దేశం, జనతా దళ్(యూ), లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) పార్టీలు యూసీసీ ప్రకటన అనంతరం ఆలోచనలో పడినట్లు సమాచారం.ఇప్పటివరకు తాము ఉమ్మడి పౌర స్మృతిపై ఎలాంటి చర్చ జరపలేదని టీడీపీ ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు తెలిపారు. అవసరమైనప్పుడు దానిని పరిశీలిస్తామని ఆయన వివరించారు. మరోవైపు జనతా దళ్ వర్కింగ్ ప్రెసిడెంట్ సంజయ్ ఝా స్పందిస్తూ.. యూసీసీ అమలుకు ముందు అమిత్ షాను కలిసి చర్చిస్తానని పేర్కొన్నారు. ఆ పార్టీ చీఫ్ నితీశ్ కుమార్ గతంలో ఉమ్మడి పౌర స్మృతి విధానానికి మద్దతిచ్చారు. అయితే అన్ని వర్గాలతో చర్చించాకే దాన్ని అమలు చేయాలని చెప్పారు. అలాగే లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) అధ్యక్షుడు చిరాగ్ పాశ్వాన్ కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. వివిధ వర్గాల ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని, సమగ్ర చర్చలు జరిపాకే యూసీసీపై తమ వైఖరిని వెల్లడిస్తామని తెలిపారు.తాజాగా ఓ ప్రెస్‌మీట్‌లో 2029 ఎన్నికలకు ముందే ఎన్డీఏ పాలిత 21 రాష్ట్రాల్లో ఉమ్మడి పౌర స్మృతిని అమలు చేస్తామని అమిత్ షా ప్రకటించిన విషయం తెలిసిందే. ఇప్పటివరకు యూసీసీ గుజరాత్, అస్సాం, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో అమలవుతోంది.



మోదీతో ఫొటోకు 'తుఝే దేఖా తో'..

# పుతిన్‌తో 'చలే చలో'..

మలేషియా ప్రధాని బాలీవుడ్ ప్లేలిస్ట్ వైరల్..



న్యూఢిల్లీ: ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు15

భారతదేశ రాజధాని ఢిల్లీ వేదికగా ఇటీవల 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు ముగిసింది. ఈ సమావేశానికి బ్రిక్స్ సభ్య, భాగస్వామ్య దేశాల అగ్రనేతలు, ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయా దేశాల ప్రతినిధులు తమ పర్యటనకు సంబంధించిన జ్ఞాపకాలను సోషల్ మీడియా వేదికగా పంచుకుంటున్నారు. అయితే మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం మాత్రం తన పోస్టులతో ప్రత్యేకంగా ఆకట్టుకున్నారు. భారత్ పర్యటనకు సంబంధించిన ఫొటోలు, వీడియోలకు ఆయన ఎంచుకున్న బాలీవుడ్ పాటలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఆయా సందర్భాలకు తగ్గట్టుగా పాటలను ఎంచుకోవడంపై నెటిజన్లు ఆసక్తిగా చర్చించుకుంటున్నారు.బ్రిక్స్ సదస్సు సందర్భంగా భారత్ మండపానికి తనకు స్వాగతం పలికిన భారత ప్రధాని నరేంద్ర మోదీ వీడియోను మలేషియా ప్రధాని ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. ఈ వీడియోకు షారుక్ ఖాన్, కాజోల్ జంటగా నటించిన 'దిల్‌వాలే దుల్హనియా లే జాయేంగే' సినిమాలోని 'తుఝే దేఖా తో యే జానా సనం' పాటను జత చేశారు. మోదీతో కలిసి ఉన్న మరో ఫొటోనూ ఆయన ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు.

# తెలంగాణ అరాచకత్వం అంచున ఉంది.. కేటీఆర్ షాకింగ్ కామెంట్స్



**మాజీ మంత్రి కేటీఆర్ పీఆర్ మహేశ్ మాణిక్య, పీఏ మహేందర్ రెడ్డిలపై నిన్న సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో దాడి జరిగినట్లు వార్తలు వచ్చాయి. ఈ విషయంపై కేటీఆర్ స్పందించి కాంగ్రెస్ ప్రభుత్వంపై షాకింగ్ కామెంట్స్ చేశారు.**

**తెలంగాణ అరాచకత్వం అంచున ఉంది.. కేటీఆర్ షాకింగ్ కామెంట్స్**

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి కేటీఆర్ పీఆర్ మహేశ్ మాణిక్య, పీఏ మహేందర్ రెడ్డిలను పోలీసులు నిన్న (సోమవారం) సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో విచారించిన విషయం తెలిసిందే. ఈ దర్యాప్తులో తెలంగాణ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా చోటుచేసుకున్న ఘటనల గురించి ఆరా తీసినట్లు తెలుస్తోంది. అయితే, పీఆర్ మహేశ్ మాణిక్య, పీఏ మహేందర్ రెడ్డిలపై పోలీస్ స్టేషన్‌లో దాడి జరిగినట్లు వార్తలు వచ్చాయి. ఈ విషయంపై ఎక్స్(శ) వేదికగా కేటీఆర్ స్పందించి కాంగ్రెస్ ప్రభుత్వంపై షాకింగ్ కామెంట్స్ చేశారు.

edited, Printed, Published and Owned by: Venkateshwarlu Rapolu # Flat No. 202, Nomula Chambers, E-Seva Road, TRT Seetaphalmandi, Sec'bad-61.Telangana. INDIA. www.trinetnews.com, Email: trinetnews2026@gmail.com (Telangana) Editor: Venkateshwarlu Rapolu, +91 98497 67747,9494184136